క్లుప్తంగా

ప్రతిభను వెలికి తీతకే శిక్షా సప్తాహ్



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

సత్యవేడు: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు శిక్షా సప్తాహ్ ఎంతగానో దోహదపడుతుందని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులుగా ఎదగడానికి శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, సాంస్కృతిక నేపథ్యం తెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో చేపట్టిన ప్రత్యేక ఆధార్ నమోదు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఆయన గురువారం కాటూరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రంలో చిన్నపిల్లలు ఆధార్, నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్లు మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం



పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: పచ్చిరొట్ట ఎరువు నేల సారవంతమవుతుందని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. గురువారం మండలంలోని ఎండీపుత్తూరులో రైతులకు రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకంతో నేలలో భూసారం తగ్గుతుందన్నారు. పచ్చిరొట్టతో భూసారం పెరిగి మంచి దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం రాయితీతో జనుములు, జీలగలను అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొరస్వామి, కేశవులు, రమేష్, పంచాయతీ కార్యదర్శి లోకముని, అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని జోత్స్నకు ఆర్థికసాయం



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని జ్యోష్ణకు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

నాగలాపురం: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన పిచ్చాటూరు మండలం వెంగళత్తూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని జ్యోత్స్నకు బంగారుపాళెం రిటైర్డ్ ఏఈఓ వరలక్ష్మి, ఆమె భర్త మునికృష్ణ రూ.10 వేలు నగదును బహుకరించారు. గురువారం ఉదయం వెంగళత్తూరు జెడ్పీ హైస్కూల్‌కు రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి దంపతులు చేరుకుని విద్యార్థినికి నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా నగదు బహుమతి ఇస్తున్నామని తెలిపారు. తమ మండలంలో విద్యార్థి ప్రతిభను గుర్తించి నగదు బహుమతిని అందించిన దాత వరలక్ష్మి దంపతులకు పిచ్చాటూరు ఎంఈఓ యుగంధర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

29 నుంచి తిరువడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 29 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా జరుగనుంది. ఇందులో భాగంగా ఉత్సవ రోజుల్లో ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. ఆగస్టు 7న శ్రీఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

ఉపాధిపై రాజకీయ పంజా

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఎంతో మంది పేదలకు ఊతమిచ్చింది. గ్రామస్థాయిలో ఎంతో మందికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని కల్పించి ఆదరువుగా నిలిచింది. ఇన్నాళ్లు ఎన్ని ప్రభుత్వాలు మారినా... ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించలేదు. ఎక్కడైనా ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగి నిర్ధారణ అయిన వారిని మాత్రమే అధికారికంగా తొలగించారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక.. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న నెలసరి గౌరవవేతనంతో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులపై ప్రతాపం చూపుతూ వినూత్న రాజకీయ శైలిని ప్రదర్శిస్తున్నారు.

- ఇప్పటికే రాజకీయ వేధింపులతో ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ముద్ర వేసి తొలగించేందుకు ఒత్తిడి
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- తలలు పట్టుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో శివకుమార్ అనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను రాజకీయ ఒత్తిళ్లతో అతని నుంచే బలవంతంగా రాజీనామా చేయించారు. మండలంలో స్థానిక నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ గ్రామంలో ఉనికిని కాపాడుకునేందుకు క్షేత్ర సహాయకులను విధుల్లో నుంచి తీసేందుకు బరి తెగిస్తున్నారు. 2006లో మొదలైన ఉపాధి హామీ పథకంలో అప్పటి నుంచి అంటే సుమారు 18 ఏళ్ల నుంచి క్షేత్ర సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న వారిపై ప్రస్తుతం రాజకీయ రంగు అద్ది తొలగించే ప్రయత్నాలు చేస్తుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. ఇన్నేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా గ్రామంలో పని చేసుకుంటూ జీవనం సాగించిన వారితో ఉన్నఫళంగా బలవంతంగా రాజీనామాలను తీసుకుని, చేతికి మట్టి అంటకుండా హింసిస్తూ పొట్టకొడుతున్నారు. వారు వేరొక ఉద్యోగానికి వెళ్లేందుకు కూడా వయసు సరిపోని పరిస్థితి. వారంతా పార్టీలకతీతంగా కేవలం జాబ్‌కార్డులు కలిగి పని కోరిన కూలీలకు ఉపాధిహామీ పనులు పెట్టించి పనులు చేయించడం వరకే పరిమితమయ్యారు. అయితే వారిపై కూడా టీడీపీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించి తొలగించాలని చూడడంపై గ్రామస్థాయిలో సామాన్య కూలీలు సైతం తప్పుపడుతున్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓ

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేణిగుంట ఎంపీడీఓ విష్ణుచిరంజీవి వ్యవహార శైలి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వ నిబంధనలకు పక్కన పెట్టి టీడీపీ నాయకులు ఆదేశించడమే తరువాయి అన్నట్లుగా చిగురుటాకులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఆయనకు ఉపాధిహామీ పథకం మండల ఏపీఓ జ్యోతిశ్రీ వంతపాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను బలవంతంగా రాజీనామా చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. తాజాగా మండలంలోని కృష్ణాపురం, అత్తూరు, సూరప్పకశం గ్రామాల్లో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను బలవంతంగా రాజీనామా చేయించాలని భీష్మించారు. ఈ మేరకు సోమవారం మండల టీడీపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని మరోసారి ఒత్తిడి తెచ్చారు. దీంతో మరో రెండు మూడు రోజుల్లో వీరిని కార్యాలయానికి పిలిపించి బలవంతంగా వారి నుంచే రాజీనామా పత్రాలను తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుముందు మండలంలోని మరిన్ని గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగనుంది. ఏదైనా అక్రమాలు చేసి, విచారణలో అవి రుజువైతే కానీ తొలగింపునకు వీలులేదని నిబంధనలు చెబుతున్నా.. అధికారులు టీడీపీ నాయకులు మాటే వేదంగా చిరుద్యోగుల పొట్టకొట్టి తమ స్వామిభక్తిని చాటుకుని తద్వారా బదిలీ నుంచి తప్పించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. దీనికై గ్రామస్థాయిలో చిన్నపాటి వేతనజీవులను బలిపశువులను చేస్తున్నారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఇలాంటి రాజకీయ తొలగింపులను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

> **మేమెవరినీ తొలగించలేదు**
>
> రేణిగుంట మండలంలో ఇప్పటి వరకు మేము ఫీల్డ్ అసిస్టెంట్లు ఎవరినీ తొలగించలేదు. వారిని రాజీనామా చేయమని బలవంతం చేయలేదు. కరకంబాడిలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా ఉంది. అక్కడ శివకుమార్ అనే వ్యక్తి మేట్‌గా ఉంటూ అదనపు బాధ్యతలు చూసుకుంటున్నాడు. ఎవరిపైన అక్రమాలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే విచారించి నిబంధనలకు లోబడి చర్యలు తీసుకుంటాం.
>
> – విష్ణుచిరంజీవి, ఎంపీడీఓ, రేణిగుంట

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



ర్యాలీ చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ పొందవచ్చని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్‌గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి, ప్రారంభించారు. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు ఆగస్టు ఒకటో తేదీ నుంచి విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు. లేదంటే పట్టుబడితే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రమాదాల బారిన పడితే వారి కుటుంబం దిక్కులేనిదవుతుందని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనచోదకుడు విధిగా హెల్మెట్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భువనేశ్వరి, ప్రధానపాధ్యాయురాలు రాజేశ్వరి, స్కౌట్స్ అండ్‌గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ పార్వతి, అజారుద్దీన్, గోపాలకృష్ణ, వెంకటరమణ, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం





పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవళ్లి దేవసేన సమేత కుమారస్వామి, స్వామివారికి పూజలు చేస్తున్న పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం చెంగల్రాయస్వామి సన్నిధిలో ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేక, హోమ పూజలు జరిపారు. ఆలయంలో చెంగల్రాయస్వామి ఉత్సవమూర్తులను కొలువు తీర్చి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు

ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి భూతవాహనాలపై విహరించనున్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

ఏర్పేడు: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. గురువారం మండలంలోని ఎండీపుత్తూరు పరిధిలోని గ్రామాల్లో మురుగునీటి కాల్వల్లో మురుగు తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద నీటి తొట్టెల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటుతో విషజ్వరాలు, డయేరియా తదితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా మురుగును తొలగించి ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ చల్లించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై అడవి పందుల దాడి



అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

ఏర్పేడు: మండలంలోని కోబాక రెవెన్యూలోని వరి పంటను బుధవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. రెవెన్యూ పరిధిలోని పొలాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఆర్‌ఎన్‌ఆర్, బుడ్డలు, 1010 తదితర వరి రకాలను సాగు చేశారు. ప్రస్తుతం వరి పొట్ట, వెన్ను దశకు చేరుకుంది. అటవీప్రాంతాల నుంచి రాత్రిళ్లు గుంపులు, గుంపులుగా అడవి పందులు వచ్చి వరి పంటను తవ్వి నాశనం చేస్తున్నాయి. ఒక నెలలో వరి ఒబ్బిళ్లు చేయాల్సిన తరుణంలో అడవి పందులు పొలాలను తవ్వివేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు.

మృత్యుశకటాలు.. ఇసుక ట్రాక్టర్లు



పట్ట కప్పకుండా వెళుతున్న ఇసుక ట్రాక్టర్

నాగలాపురం: ఇసుక ట్రాక్టర్లు ప్రజలు, వాహనచోదకుల పాలిట మృత్యుశకటాలుగా మారుతున్నాయి. మండలంలోని సుబ్బనాయుడుకండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్ నుంచి రోజూ వందల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్లలో నగరి, పుత్తూరు తదితర సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కానీ ఇసుకను ట్రాక్టర్లలో నింపుకుని వెళ్లేటప్పుడు ట్రాక్టర్ ట్రాలీపై పట్టలు కప్పకుండా తీసుకెళుతుండడంతో ఆ ఇసుక వెనుక వచ్చే వాహనచోదకుల కళ్లలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా వాహనచోదకులు మృత్యుపాలవుతున్నారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించడంతోపాటు ఇసుకపై పట్టలు కప్పుకుని వెళ్లేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ద్విచక్ర వాహనచోదకులు కోరుతున్నారు.

సిద్ధ ఔషధం పంపిణీకి విశేష స్పందన



ఏకంలో మందు పంపిణీ చేస్తున్న లోకా ఫౌండేషన్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర సమస్యల కోసం ఉచితంగా ఇస్తున్న కలిక్కం సిద్ధ ఔషధం పంపిణీకి విశేష స్పందన లభించింది. మండలంలోని బత్తలవల్లంలో ఉన్న ఏకం ఆలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 250 మందికి ఈ ఔషధాన్ని పంపిణీ చేశారు. ఏకం వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ మాట్లాడుతూ కలిక్కం అనేది సిద్ధ వైద్యంలో కంటి వైద్యమని సిద్ధులు సంప్రదాయబద్ధంగా ఉపయోగించే కొన్ని అరుదైన మూలికల సారాలను కళ్లలోకి పోయడంతో కంటిచూపు వృద్ధి చెందడంతోపాటు పలు చర్మ వ్యాధులు నయమవుతాయని పేర్కొన్నారు. క్యాంప్ డైరెక్టర్ సతీష్, వైద్యులు ముత్తు కృష్ణన్ పాల్గొన్నారు.

చెంగల్వరాయస్వామికి గ్రామోత్సవం



ఊరేగుతున్న చెంగల్వరాయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వద్ద గురువారం ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారు పురవిహారానికి బయలుదేరారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

31న స్పాట్ అడిషన్లు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31న స్పాట్ అడిషన్లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. టీసీ, టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణపత్రం, ఆరు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ మూడు కాపీలు, ఒరిజనల్ ఆధార్ కార్డుతో పాటు అన్ని మూడు సెట్లు జిరాక్స్ తీసుకురావాలన్నారు.

సూచికబోర్డులు అందజేత



సూచికబోర్డులు అందజేస్తున్న యాక్ట్ ఫైబర్ నెట్ సంస్థ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి విశాఖపట్టణానికి చెందని యాక్ట్ ఫైబర్ నెట్ వారు గురువారం సుమారు రూ.2 లక్షలు విలువ చేసే నాలుగు సూచిక బోర్డులను అందజేశారు. వీటిని ఆలయాధికారులు స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈస్ట్ పీఎస్‌లో తనిఖీలు

తిరుపతి క్రైమ్: జిల్లావ్యాప్తంగా గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో అనుమానిత వ్యక్తులను ఆరా తీశారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఆదేశించారు.

ఉపాధిహామీతో వలసల నివారణ



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: ఉపాధిహామీ పనులతో వలసల నివారణ జరుగుతుందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. గురువారం మండలంలోని మునలిపేడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున ఉపాధిహామీ పథకంలో కూలీలకు విరివిగా పనులు కల్పించాలని సూచించారు. ప్రతి రోజూ కూలీలకు రూ.300 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల పొలాల్లో నీటి గుంటలను ఏర్పాటు చేస్తే వ్యవసాయ బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. పంచాయతీ పరిధిలోని ఏడు రకాల రిజిస్టర్లను సిబ్బంది ప్రతివారం అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు రవీంద్రుడు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బుచ్చినాయుడుకండ్రిగలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని, విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు జరుగుతాయని, ఆటలతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, పీడీలు కిషోర్‌కుమార్, మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్వహణలోపం..ప్రయాణికులకు శాపం

- రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల తిష్ట
- పట్టించుకోని అధికారులు



రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆవుల మంద

రేణిగుంట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో ప్రయాణికులు అవస్థలపాలవుతున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులు వేచి ఉండే ప్రాంగణమంతా చిత్తు కాగితాలు, చెత్త, చెదారం చేరి దుర్వాసన వెదజల్లుతోంది. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు అక్కడే వేచి ఉండి బస్సులు ఎక్కుతున్నారు. దీనికితోడు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోనే రెండు వైపులా ఆటోస్టాండ్లు ఉండడంతో వాహన రాక, పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తరచూ ఆవుల మంద కూడా బస్టాండ్ ఆవరణలో తిష్ట వేస్తున్నాయి. బస్టాండ్ ప్రాంగణమంతా అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసనతో ప్రయాణికులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు ఉన్నా... వినియోగంలో లేకపోవడంతో ముఖ్యంగా మహిళా ప్రయాణికులు మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని బస్టాండ్‌లో వసతులను మెరుగుపరచడంతోపాటు పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో ఆవరణలో పేరుకుపోయిన చెత్త



ప్రాంగణమంతా అపరిశుభ్రం



నిరుపయోగంగా మరుగుదొడ్లు